క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

నిజాంపేట్: విద్యుత్ ఫీడర్ల నిర్వహణ నేపథ్యంలో శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం తలెత్తనుందని ప్రగతినగర్ సెక్షన్ ఏఈ ఓ ప్రకటనలో తెలియజేశారు. 11కేవీ ఆర్‌జీకే, ఎలీప్ కేబుల్ ఫీడర్ పరిధిలో ఉదయం 8 గంటల నుంచి 11గంటల వరకు వాసవీ లేఅవుట్, విజేత సూపర్ మార్కెట్, ప్రగతి సెంట్రల్ స్కూల్, ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఎలీప్ ఇండస్ట్రియల్ ఏరియాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు సహకరించాలని ఏఈ కోరారు.

మహిళలకు సత్కారం



జయరామ్‌నగర్‌లో మహిళలను సత్కరిస్తున్న ఉజ్వల మహిళా మండలి అధ్యక్షురాలు కృష్ణవేణి

కుత్బుల్లాపూర్: జయ్‌రామ్‌నగర్‌కు చెందిన మహిళలను అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం ఉజ్వల మహిళ మండలి అధ్యక్షురాలు బడిగుల కృష్ణవేణి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కుటుంబాన్ని నెట్టుకురావడానికి కాయకష్టం చేస్తూ రోజంతా శ్రమించే మహిళలే అందరికీ ఆదర్శమన్నారు. వారిని సత్కరించుకోవడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఉజ్వల మహిళా మండలి ప్రధాన కార్యదర్శి సరోజిని, వైస్ ప్రెసిడెంట్ బాలమణి, కోశాధికారి లక్ష్మి, స్థానికులు రాధ, కవిత, కావ్య తదితరులు పాల్గొన్నారు.

బహిరంగ ప్రదేశాల్లో మాస్కులు ధరించాలి

కుత్బుల్లాపూర్: జంట సర్కిళ్ల పరిధిలో కోవిడ్-19 పరీక్షలు కొనసాగుతున్నాయి. గురువారం సూరారం కాలనీ యూపీహెచ్‌సీలో 19 మందికి పరీక్షలు చేయగా అందరికి నెగిటివ్ రిపోర్టులు వచ్చినట్లు వైద్యాధికారులు తెలిపారు. ఫ్లూ వైరస్ విజృంభిస్తున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. బహిరంగ ప్రదేశాల్లో మాస్కులు ధరించి జాగ్రత్త పడాలని అధికారులు సూచిస్తున్నారు.

త్వరలో కొత్త బోర్ వేస్తాం



గాంధీనగర్‌లో బయటకు తీసిన బోర్ పైపులను పరిశీలిస్తున్న జలమండలి జీఎం

రంగారెడ్డినగర్: వేసవిలో ప్రజలకు నీటి కష్టాలు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నామని కుత్బుల్లాపూర్ జలమండలి జనరల్ మేనేజర్ శ్రీధర్‌రెడ్డి అన్నారు. గురువారం రంగారెడ్డినగర్ డివిజన్ గాంధీనగర్‌లో పాడైన బోర్‌ను, పైపులను భువనగిరి నుంచి ప్రత్యేక బోర్‌వెల్ టీమ్‌ను రప్పించి తీయించారు. ఈ సందర్భంగా శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ... రెండు, మూడు రోజుల్లో కొత్త బోర్‌ను వేస్తామని తెలిపారు.

నేడు ప్రభుత్వ ఎంపీపీ పాఠశాల వార్షికోత్సవం

కుత్బుల్లాపూర్: జీడిమెట్లలోని ప్రభుత్వ ఎంపీపీ పాఠశాల వార్షికోత్సవం ఈనెల 10న నిర్వహించనున్నారు. ఉదయం 10గంటల నుంచి జరిగే వేడుకల్లో భాగంగా విద్యార్థులు సంస్కృతిక నృత్యాలతో పాటు ఉపాధ్యాయులను సత్కరించనున్నారు. అదే విధంగా ప్రతిభ కనబరుస్తున్న విద్యార్థులకు బహుమతులతో పాటు సర్టిఫికెట్ల ప్రదానం ఉంటుందని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు తెలిపారు.

అసత్య ప్రచారం చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలి

కుత్బుల్లాపూర్: శంభీపూర్ రాజుపైన ఫేక్ చానళ్ల పేరుతో అసత్య ప్రచారానికి తెగబడిన వారిపై చర్యలు తీసుకోవాలని బీఆర్‌ఎస్ యువ నాయకుడు రావల్‌కోల్ కిరణ్ పేట్‌బషీరాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఎవరు ఎన్ని విధాలుగా అసత్య ప్రచారాలు చేసిన రాజన్న ఎదుగుదలను అపలేరని బీఆర్ఎస్ యువ నాయకులు అన్నారు. పోలీసులు వెంటనే అసత్య ప్రచారానికి తెరలేపిన వారిని గుర్తించి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

నేడు భవిష్య నిధి అదాలత్

మూసాపేట: కూకట్‌పల్లిలోని ప్రావిడెంట్ ఫండ్ కార్యాలయంలో భవిష్య నిధి అదాలత్ నిర్వహించనున్నట్లు అసిస్టెంట్ పీఎఫ్ కమిషనర్ హేమంత్ తెలిపారు. ఈనెల 10వ తేదీ ఉదయం 10గంటలకు కూకట్‌పల్లి ప్రశాంత్‌నగర్‌లోని ఆర్‌టీసీ బస్ టెర్మినల్‌లో రెండో అంతస్తులోని పీఎఫ్ కార్యాలయంలో ఉంటుందన్నారు. ఖాతాదారులు తమ సమస్యలు పరిష్కరించుకోవడమే కాక సలహాలు సూచనలు స్వీకరిస్తామని అన్నారు. కూకట్‌పల్లి మియాపూర్, లింగంపల్లి, బీహెచ్‌ఈయల్, జీడిమెట్ల, సనత్‌నగర్ ఖాతాదారులు పాల్గొనవచ్చునని తెలిపారు.

పార్కు, షాపింగ్ కాంప్లెక్స్ స్థలాలను కాపాడాలి

నిజాంపేట్ కార్పొరేషన్ బీజేపీ నేతల డిమాండ్



అధికారులకు ఫిర్యాదు చేస్తున్న బీజేపీ నిజాంపేట్ కార్పొరేషన్ అధ్యక్షుడు సతీష్



కోర్టు స్టే ఆర్డర్ ఉన్న ప్రాంతంలో వెలిసిన నిర్మాణం

నిజాంపేట్: నిజాంపేట్ కార్పొరేషన్ పరిధిలోని రేణుకాఎల్లమ్మకాలనీ పార్క్, షాపింగ్ కాంప్లెక్స్ స్థలాన్ని కాపాడాలని బీజేపీ కార్పొరేషన్ అధ్యక్షుడు ఆకుల సతీష్ డిమాండ్ చేశారు. గురువారం నిజాంపేట్ కార్పొరేషన్ అధికారులు, రెవెన్యూ అధికారులకు ఈ విషయమై ఫిర్యాదు చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్పొరేషన్ పరిధిలని 18వ డివిజన్‌లో ఉన్న రేణుకాఎల్లమ్మ కాలనీకి చెందిన 1200 గజాల పార్కు స్థలాన్ని, 800 గజాల షాపింగ్ కాంప్లెక్స్ స్థలాలను ఆక్రమించేందుకు కొన్నేళ్లుగా కొందరు యత్నిస్తున్నారని తెలిపారు. గతంలో తాము ఫిర్యాదు చేయడంతో కార్పొరేషన్ అధికారులు నిర్మాణాలను కూల్చివేశారని పేర్కొన్నారు.

అధికార పార్టీ అండతో మళ్లీ నిర్మాణాలు..

తాజాగా అధికార పార్టీ ప్రజాప్రతినిధి అండతో మళ్లీ నిర్మాణాలు జరుగుతున్నాయని తెలిపారు. సర్వే నం. 486, రేణుకాఎల్లమ్మ కాలనీ లేఅవుట్ 13 ఎకరాల విస్తీర్ణంలో 1989 చేశారన్నారు. కాలనీ అవసరాల నిమిత్తం 1200 గజాలను పార్కు స్థలానికి, షాపింగ్ కాంప్లెక్స్‌కు 800 గజాలను విడిచి పెట్టారన్నారు. ప్రస్తుతం ఈ స్థలాలపై రంగారెడ్డి జిల్లా కోర్టు ఇంజక్షన్ ఆర్డర్ ఉన్నా అనుమతులు లేకుండా మే 2022 కాంపౌండ్ వాల్, రేకుల షెడ్ వేశారని తెలిపారు. విషయం తెలుసుకుని బీజేపీ ఆధ్వర్యంలో మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేయగా నామమాత్రంగా చర్యలు చేపట్టి చేతులు దులుపుకున్నారని తెలిపారు. దీని వెనుక అధికార పార్టీకి చెందిన ఒక కార్పొరేటర్ అండదండల ఉన్నాయన్నారు.

◆ తప్పుడు రిజిస్ట్రేషన్ చేసుకోవడమే కాకుండా అడ్డుకున్న కాలనీవాసులపై అక్రమ కేసులు పెడుతూ భయభ్రాంతులకు గురి చేస్తున్నారని తెలిపారు. కోర్టు స్టే ఆర్డర్ ఉన్నా ఆక్రమణలు జరుగుతున్నాయన్నారు. ఎల్లమ్మ కాలనీ వెంచర్ సంబంధించి ప్రైవేట్ భూమిని వెంకట్‌రెడ్డి నుంచి 1989 చార్లెస్ 13 ఎకరాలు కొనుగోలు చేసి, గొట్టిముక్కల పద్మారావు, మోటాసింగ్‌కు జీపీఏ చేయడమే కాకుండా లేఅవుట్ వేసిన వెంకటరెడ్డి మళ్లీ కాలనీకి సంబంధించిన పార్కు స్థలం, షాపింగ్ కాంప్లెక్స్ స్థలం వేరే వ్యక్తులకు ఏ విధంగా రిజిస్ట్రేషన్ చేస్తారని ఆరోపించారు.

◆ అధికార పార్టీ కార్పొరేటర్, రిజిస్ట్రేషన్ అధికారులు సహకరించడం వల్లే ఆక్రమణ, భూమికి సంబంధించి పేపర్లు పుట్టుకొచ్చాయని ఇప్పటికైనా మున్సిపల్, రెవెన్యూ అధికారులు దృష్టి సారించి స్థలంపై పూర్తి దర్యాప్తు జరిపి కాపాడాలని డిమాండ్ చేశారు. ప్రజా ఆస్తులను తప్పుడు పత్రాలతో బినామీ పేర్లతో కొల్లగొట్టిడం కాకుండా వారికి అండగా నిలబడి అక్రమ నిర్మాణ పనులు చేయిస్తున్న వారిపై తెలంగాణ మున్సిపల్ చట్టం-2019 ప్రకారం చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కిసాన్ మోర్చా ఉపాధ్యక్షుడు మాధవరావు, ట్రేడర్ సెల్ కన్వీనర్ ఈశ్వర్‌రెడ్డి, ఓబీసీ మోర్చా అధ్యక్షుడు మదన్‌గౌడ్, కాలనీ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమంలో పని చేసిన ప్రతి ఒక్కరికి గుర్తింపు



ఎమ్మెల్సీగా నామినేషన్ వేస్తున్న నవీన్‌కుమార్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న శంభీపూర్‌రాజు

కుత్బుల్లాపూర్: తెలంగాణ ఉద్యమంలో పని చేసిన ప్రతి కార్యకర్తకు గుర్తింపు ఇవ్వడమే బీఆర్‌ఎస్ అధినేత, ముఖ్యమంత్రి కేసీఆర్ ఉద్దేశమని... పార్టీ కోసం పనిచేసే వారికి పట్టం కట్టే విధంగా ఎమ్మెల్సీగా రెండోసారి నవీన్‌కుమార్‌కు అవకాశం ఇవ్వడం సంతోషకరమని శాసనమండలి విప్, ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజు అన్నారు. గురువారం ఎమ్మెల్సీగా నామినేషన్ వేస్తున్న నవీన్‌కుమార్‌కు మద్దతుగా మంత్రులు ఎమ్మెల్యేలతో కలిసి వెళ్లిన ఎమ్మెల్సీ రాజు మాట్లాడుతూ.. బీజేపీ ఎన్ని కుట్రలు కుతంత్రాలు చేసినా తెలంగాణలో అధికారంలోకి రావడం కలేనని అన్నారు. రాష్ట్రం కోసం తన ప్రాణాలను సైతం లెక్కచేయకుండా పోరాడిన వీరుడు ముఖ్యమంత్రి కేసీఆర్ అని పేర్కొన్నారు. తమ అధినేతను విమర్శించే అధికారం కాంగ్రెస్, బీజేపీలకు లేదని తేల్చి చెప్పారు. కేంద్రంపై పోరాడుతున్న నెపంతో ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితకు ఈడీ నోటీసులు పంపడం రాజకీయ కక్ష సాధింపులో భాగమేనని అన్నారు.

కొంపల్లి మున్సిపాలిటీలో 72శాతం ఆస్తిపన్ను వసూలు

కొంపల్లి మున్సిపల్ కమిషనర్ శ్రీహరి

కుత్బుల్లాపూర్: కొంపల్లి మున్సిపాలిటీలో ఆస్తిపన్ను వసూళ్లపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. 2022-23 ఆర్థిక సంవత్సరంలో మొత్తం రూ.9.28 కోట్లు వసూలు చేయాల్సి ఉండగా ఇప్పటి వరకు 72 శాతం పన్నులు వసూలు చేసినట్లు కొంపల్లి మున్సిపల్ కమిషనర్ శ్రీహరి పేర్కొన్నారు. ప్రతిరోజు బిల్ కలెక్టర్‌లకు రోజువారీగా 5 లక్షల చొప్పున టార్గెట్ విధించడంతో మరో 21 రోజుల్లో పూర్తిస్థాయిలో 100% పన్నులు వసూలు చేసే దిశగా ప్రయత్నం చేస్తున్నట్లు వివరించారు. మున్సిపాలిటీలో అభివృద్ధి పన్నులు చేసుకోవాలంటే ప్రజలు తప్పక పనులు చెల్లించాలని సూచించారు. కాలనీలో మురికివాడల్లో మౌలిక వసతుల కల్పనకు ఇవి ఉపయోగపడతాయని పేర్కొన్నారు. ప్రజలు సహకరించి పన్నులు చెల్లించాలని కోరారు.

ఎన్నికల నిర్వహణలో నిర్లక్ష్యం వద్దు

సాక్షి, మేడ్చల్ జిల్లా: మహబూబ్ నగర్, రంగారెడ్డి, హైదరాబాద్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లాకు చెందిన మైక్రో అబ్జర్వర్లు, ప్రిసైడింగ్, అసిస్టెంట్ ప్రిసైడింగ్, ఓపీవోలు తమ విధులను జాగ్రత్తగా నిర్వహించాలని, నిర్లక్ష్యం వహించరాదని జిల్లా అదనపు కలెక్టర్ నర్సింహారెడ్డి అన్నారు. ఈనెల 13న జరగనున్న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా రెవెన్యూ అధికారి లింగ్యానాయక్, జిల్లా పరిషత్ సీఈవో దేవసహాయంలతో కలిసి శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్, ఏఆర్వో నర్సింహారెడ్డి మాట్లాడుతూ.. ఎన్నికల్లో విధులు నిర్వహించే అధికారులు ఎన్నికల కమిషన్ నుంచి ఎప్పటికప్పుడు వచ్చే ఆదేశాలను క్షుణ్ణంగా చదవాలని ఆదేశించారు. ఏదైనా కారణాలతో ప్రిసైడింగ్ అధికారి ఎన్నికలు నిర్వహించలేకపోతే అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారి కూడా ఎన్నికలు నిర్వహించే విధంగా సంసిద్ధంగా ఉండాలని నర్సింహారెడ్డి సూచించారు.

కార్పొరేట్ కళాశాలల దోపిడీకి అడ్డుకట్ట వేయాలి

జీడిమెట్ల: కార్పొరేట్ కళాశాలలు పీఆర్‌ఓల ద్వారా అడ్మిషన్‌లు చేయాలని పదో తరగతి విద్యార్థుల తల్లిదండ్రులను అయోమయానికి గురి చేస్తున్నారని ఎస్‌ఎస్‌యూఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గొల్ల జాన్ అన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులను అయోమయంలో పడేసి అడ్మిషన్ తీసుకున్న తర్వాత చెప్పిన చోట కాకుండా మరోచోట అడ్మిషన్ ఇచ్చి విద్యార్థుల జీవితాలతో ఆటలు ఆడుతున్నారని అన్నారు. కార్పొరేట్ కళాశాలలు దోపిడీకి అడ్డుకట్ట వేయాల్సిన విద్యాశాఖ అధికారులు వారికి వత్తాసు పలుకున్నారని మండిపడ్డారు. కార్పొరేట్ కళాశాలల్లో ఒత్తిడి భరించలేక ప్రతిఏటా విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకుంటున్నా ప్రభుత్వంలో ఎలాంటి చలనం లేదన్నారు. ప్రైవేట్, కార్పొరేట్ కళాశాలలు అధికార పార్టీ నాయకుల అండదండలతో నడుస్తున్నాయని తెలిపారు. కార్పొరేటు కళాశాలలు స్పెషల్, ట్యూషన్ ఫీజులు, పుస్తకాల పేరిట లక్షల రూపాయల్లో ఫీజుల వసూలు చేస్తున్నారని పేర్కొన్నారు. విద్యార్థి సంఘాల తరపున ఎన్ని సార్లు ఫిర్యాదులు చేసినా విద్యాశాఖ తీరులో మార్పులేకపోవడం సిగ్గుచేటన్నారు.

కర్దనూర్‌లో మాల్దీవ్ బృందం పర్యటన

- పల్లె ప్రకృతి వనం, నర్సరీ సందర్శన
- గ్రామాభివృద్ధిపై పాలకవర్గానికి అభినందన

పటాన్‌చెరు టౌన్: మండలంలోని కర్దనూర్ గ్రామంలో మాల్దీవ్ బృందం గురువారం పర్యటించింది. గ్రామాల పరిశీలనలో భాగంగా నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్ (ఎన్‌ఐఆర్డీ) ఆధ్వర్యంలో మాల్దీవ్‌కు చెందిన 30 మందితో కూడిన బృందం జిల్లా అధికారులతో కలిసి కర్దనూర్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామంలో అమలవుతున్న సంక్షేమ కార్యక్రమాలు, పల్లె ప్రకృతి వనం, నర్సరీలు, పారిశుధ్యం, డంపింగ్ యార్డ్‌లను సభ్యులు పరిశీలించారు. తడి, పొడి చెత్త సేకరణ, కంపోస్టు ఎరువు తయారీపై అడిగి తెలుసుకొని వివరాలు నమోదు చేసుకున్నారు. మాల్దీవ్ దేశం ఎక్కువగా టూరిజంపై ఆధారపడిందని, వారి వద్ద చెత్త సమస్య తీవ్రంగా ఉందన్నారు. డంప్ యార్డు నిర్వహణను తమ దేశంలోనూ అమలు చేసేందుకు ప్రతిపాదిస్తామన్నారు. ప్రతీ గ్రామంలో నర్సరీలను ఏర్పాటు చేసి పచ్చదనం పెంపునకు తీసుకుంటున్న చర్యలపై జిల్లా పంచాయతీ అధికారి సురేష్ మోహన్ వారికి వివరించారు. కోతుల ఆహార కేంద్రాన్ని చూసి వావ్.. అంటూ ఆశ్చర్యపోయారు. గ్రామ అభివృద్ధిపై హర్షం వ్యక్తం చేస్తూ సర్పంచ్ ఎర్రోళ్ల విజయలక్ష్మిని, ఉప సర్పంచ్, పాలకమండలిని అభినందించారు. గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి, ఆశ వర్కర్ల పని తీరు, పంచాయతీ గ్రామ సభ, సర్వసభ్య సమావేశం వివరాలు తెలుసుకున్నారు. మాల్దీవ్ బృందంతో డీపీఓ సురేష్ మోహన్, ఎంపీడీఓ బన్సీలాల్, మండల పంచాయతీ అధికారి హరిశంకర్ గౌడ్, గ్రామ పంచాయతీ కార్యదర్శి నీలిమ, పాశమైలారం కార్యదర్శి రిజ్వాన్ తదితరులు పాల్గొన్నారు.

100శాతం ఉత్తీర్ణతకు కృషి చేయాలి

- జిల్లా విద్యాశాఖ అధికారి విజయకుమారి
- పదో తరగతి పరీక్ష సన్నద్ధతపై ఉపాధ్యాయులతో సమీక్ష
- సీ-గ్రేడ్ వచ్చిన విద్యార్థులపై దృష్టి పెట్టాలని ఆదేశం



జ్యోతి ప్రజ్వలన చేసి సమావేశాన్ని ప్రారంభిస్తున్న డీఈఓ విజయకుమారి

కూకట్‌పల్లి: పదో తరగతి వార్షిక పరీక్ష సన్నద్ధతపై ప్రధానోపాధ్యాయులు,ఉపాధ్యాయులతో మేడ్చల్, మల్కాజ్‌గిరి జిల్లా విద్యాశాఖ అధికారి ఐ.విజయకుమారి గురువారం సమీక్షా సమావేశాన్ని కూకట్‌పల్లిలోని పీఎస్‌ఎం పాఠశాలలో జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, గణిత, భౌతిక శాస్త్రం, జీవశాస్త్ర ఉపాధ్యాయులతో రెండు రోజుల పాటు సమీక్ష సమావేశాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధానంగా పదో తరగతి ప్రీ ఫైనల్‌లో ఫలితాలు వారీగా ఒకొక్క ప్రధానోపాధ్యాయుడితో సమావేశమయ్యారు.

◆ తక్కువ ఉత్తీర్ణత శాతం వచ్చిన పాఠశాల ప్రధానోపాధ్యాయులను అక్కడ ఉన్న సమస్యలను అడిగి తెలుసుకునారు. సీ-గ్రేడ్ విద్యార్థులకు 30 రోజుల పాటు ప్రత్యేక శ్రద్ధను వహించి జిల్లాలో అన్ని పాఠశాలల్లో 100 శాతం ఉత్తీర్ణత వచ్చే విధంగా ప్రతి ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయుడు కృషి చేయాలని ఆదేశించారు.

◆ అదే విధంగా ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ సమగ్ర శిక్ష ద్వారా ప్రత్యేకంగా చేపడుతున్న తొలిమెట్టు, మన ఊరు - మన బడి, పాఠశాల బయట పిల్లల సర్వే పలు అంశాలను కూడా సమీక్షించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారులు, డిస్ట్రిక్ట్ కామన్ ఎగ్జామినేషన్ బోర్డు సెక్రటరీ, అసిస్టెంట్ కమిషనర్ ప్రభుత్వ పరీక్షల విభాగం, సమగ్ర శిక్ష కోఆర్డినేటర్స్ తదితరులు పాల్గొన్నారు.

భూగర్భజలాలు పుష్కలం



గతేడాది కురిసిన వర్షాలకు భూగర్భ జలాలు విపరీతంగా పెరిగాయి. గాజులరామారంలో కొత్తగా ఇళ్లు నిర్మించే వారు బోర్లు వేస్తుండటంతో నీరు పుష్కలంగా వస్తుంది. గురువారం ఓ వ్యక్తి గాజులరామారం బాలయ్యనగర్‌లో బోరు వేయగా 300ఫీట్లలోనే 5ఇంచుల నీరు వచ్చింది. దీంతో ఆ ఇంటి యజమాని సంతోషానికి అవధులు లేకుండా పోయింది. – సుభాష్‌నగర్

ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నాం

ప్రగతియాత్రలో ఎమ్మెల్యే వివేకానంద్



రామరాజునగర్‌లో ప్రగతియాత్రలో భాగంగా సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే వివేకానంద్

రంగారెడ్డినగర్: ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ ఆయా ప్రాంతాల్లో మౌలిక వసతులను మెరుగు పరుస్తున్నామని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. ప్రగతియాత్రలో భాగంగా గురువారం జీడిమెట్ల డివిజన్ పరిధి రామరాజునగర్‌లో పాదయాత్ర చేపట్టిన ఎమ్మెల్యే స్థానికంగా నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తమ కాలనీలో నూతన ట్రాన్స్‌ఫార్మర్, ఓపెన్ జిమ్, నూతన డ్రైనేజీ లైన్ ఏర్పాటు చేయాలని స్థానికులు ఆయనను సానుకూలంగా స్పందించారు.

◆ ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... ఏ ప్రభుత్వం హయాంలో జరగని అభివృద్ధి బీఆర్ఎస్ ప్రభుత్వం తొమ్మిదేళ్ల పాలనలో చేసి చూపించిందన్నారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా సీఎం కేసీఆర్ పని చేస్తున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీ ప్రెసిడెంట్ కృష్ణకాంత్‌రెడ్డి, జనరల్ సెక్రటరీ నాగేశ్వరరావు, ట్రెజరర్ రవీందర్ రెడ్డి, వైస్‌ప్రెసిడెంట్లు సతీష్, రాజేశ్వరి, జాయింట్ సెక్రటరీలు నాగేశ్వర్‌రావు, రాణి, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు కుంట సిద్ధిరాములు, గుమ్మడి మధుసూదన్‌రాజు, జ్ఞానేశ్వర్, కాలే నాగేష్, కాలే గణేష్ తదితరులు పాల్గొన్నారు.

◆ జగద్గిరిగుట్ట వార్త విలేకరి విఠల్ భార్య కేన్సర్‌తో బాధపడుతున్న విషయం తెలిసిన ఎమ్మెల్యే కేపీ వివేకానంద స్పందించారు. వెంటనే తక్షణ సహాయం కింద లక్ష రూపాయల ఆర్థిక సహాయం అందజేశారు. విషయం తెలిసిన వెంటనే ఎమ్మెల్యే విఠల్‌తో ఫోన్‌లో మాట్లాడారు. తాను అండగా ఉంటానన్నారు. త్వరలోనే వచ్చి కలుస్తానని తెలిపి భరోసానిచ్చారు. జగద్గిరిగుట్ట ప్రాంత నాయకులతో డబ్బులను పంపించి తన ఔదార్యాన్ని చాటుకున్నారు. జర్నలిస్ట్ కుటుంబాన్ని ఆదుకున్న ఎమ్మెల్యేకు టీయూడబ్ల్యూజే మేడ్చల్ అధ్యక్షులు గడ్డమీది బాలరాజు కృతజ్ఞతలు తెలియజేశారు.

జీఆర్ఐఈటీతో ఐడీఎస్ ఎంఓయూ



ఎంఓయూ కుదుర్చుకున్న జీఆర్ఐఈటీ ప్రిన్సిపాల్ ప్రవీణ్, ఐడీఎస్ సీఈవో సుదర్శన్‌రెడ్డి

నిజాంపేట్: బాచుపల్లికి చెందిన గోకరాజు రంగరాజు ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ (జీఆర్ఐఈటీ) కళాశాల, ఐడీఎస్ (ఇన్ఫర్మేషన్ డేటా సిస్టమ్స్) సంస్థలు గురువారం పరిశోధన, బ్లాక్ చైన్ అప్లికేషన్స్ అభివృద్ధిలో ఉమ్మడి ప్రయత్నాల కోసం ఎంఓయూ కుదుర్చుకున్నాయి. ఈ ఒప్పందంతో బ్లాక్‌చెయిన్ టెక్నాలజీ ప్రాంతంలో విద్యార్థులకు నైపుణ్యం, సామర్థ్యాలను అందించడం, వారి కెరీర్‌ను నిర్మించుకునేలా చేయడం ఈ అవగాహన ఒప్పందం ఉద్దేశమన్నారు. బ్లాక్‌చెయిన్ టెక్నాలజీని ఉపయోగించి పరిశోధన చేయడానికి ఇది ఉపయోగపడుతుందన్నారు. ఐడీఎస్ ఆర్థిక ఆర్థిక సహాయంతో ఇంటర్న్‌షిప్‌లను అందించడంతో పాటు విద్యార్థుల ఉద్యోగవకాశాలు మెరుగు పడతాయని ప్రిన్సిపాల్ ప్రవీణ్ జగ్గే తెలిపారు.

◆ ఐడీఎస్ సీఈవో సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ... ఐడీఎస్ ఒక హైపర్‌లెడ్జర్ ట్రైనింగ్ పార్టనర్ (హెచ్‌టీపీ), హైపర్‌లెడ్జర్ సర్టిఫైడ్ ట్రైనింగ్ ప్రొవైడర్ (హెచ్‌టీపీసీ) దాని సర్టిఫికేషన్ ప్రోగ్రాంల ద్వారా విద్యారంగం నుంచి పరిశ్రమ వరకు నాణ్యమైన నైపుణ్యత కలిగిన విద్యార్థులను తయారు చేయడానికి ప్రయత్నిస్తామని పేర్కొన్నారు. విద్యార్థుల స్టార్టప్ ఆలోచనల కోసం సీడ్ ఫండింగ్ ద్వారా వారికి మద్దతు ఇవ్వడానికి ఐడీసీ ఆసక్తిగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

మహిళల అభ్యున్నతికి ఎంతో కృషి చేస్తున్నాం



మహిళలను ఉద్దేశించి మాట్లాడుతున్న ఎమ్మెల్యే వివేకానంద

జీడిమెట్ల: మహిళల అభ్యున్నతికి బీఆర్ఎస్ ప్రభుత్వం ఎంతో కృషి చేస్తోందని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ అన్నారు. బుధవారం రాత్రి సుభాష్‌నగర్ డివిజన్ ఎస్ఆర్‌నాయక్‌నగర్‌లో మహాలక్ష్మి మహిళా పొదుపు సమాఖ్య ఆధ్వర్యంలో మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ... డ్వాక్రా సంఘాలకు తెలంగాణ ప్రభుత్వం ప్రతిఏటా కోట్ల రూపాయలను విడుదల చేస్తుందన్నారు. ప్రతి మహిళ కోట్లాడి వారి హక్కులను పొందాలన్నారు. స్త్రీల హక్కుల కోసం పోరాటం చేసిన ఎంతోమంది వీర వనితలను ఆదర్శంగా తీసుకుని మహిళలు ముందుకు సాగాలని సూచించారు.

◆ నేటి సమాజంలో మహిళలు పరిశ్రమలను స్థాపించి ఎంతో మందికి ఉపాధిని కల్పిస్తున్నారని అన్నారు. మహిళలకు నిర్వహించిన ఆటల పోటీల్లో గెలుపొందిన వారికి ఎమ్మెల్యే బహుమతులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్పీ శ్రీదేవి, అధ్యక్షురాలు శోభ, జనరల్ సెక్రటరీ నాగలక్ష్మి, వైస్ ప్రెసిడెంట్ త్రివేణి, ఆర్గనైజింగ్ సెక్రటరీ నాగలక్ష్మి, ట్రెజరర్ సీతామహాలక్ష్మి, బీఆర్ఎస్ నాయకులు గుడిమెట్ల సురేష్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్ రంగారావు, కాలనీ జనరల్ సెక్రటరీ మహేందర్‌రెడ్డి, డివిజన్ యువజన అధ్యక్షులు మన్నెరాజు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి దివ్యాంగుల బస్‌పాస్‌ల మేళా

రాయదుర్గం: గ్రేటర్ హైదరాబాద్ జోన్ పరిధిలో దివ్యాంగుల సౌకర్యార్థం 'దివ్యాంగుల బస్‌పాస్‌ల స్పెషల్ మేళా'ను నిర్వహించడం జరుగుతుందని టీఎస్ ఆర్టీసీ గ్రేటర్ హైదరాబాద్ జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎస్ కృష్ణకాంత్ గురువారం తెలిపారు. శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పాస్‌లు జారీ చేస్తారన్నారు. బస్‌పాస్ పొందటానికి పాస్‌పోర్టు సైజ్ ఫొటో, సదరం సర్టిఫికెట్ కాపీ, ఆధార్‌కార్డు, ఐడీ కార్డు తీసుకు రావాలని, సర్వీస్‌చార్జీ కింద రూ.50ల రుసుముతో సంప్రదించాలన్నారు. శుక్రవారం (10వ తేదీ) పటాన్‌చెరు బస్ పాస్ కేంద్రం, సోమవారం (13వ తేదీ) దిల్‌సుఖ్‌నగర్, బుధవారం (15వ తేదీ) ఇబ్రహీంపట్నం, శుక్రవారం (17వ తేదీ) మెహిదీపట్నం, సోమవారం(20)వ తేదీ సీబీఎస్‌లోని బస్‌పాస్ కేంద్రంలో మేళా జరుగుతుందన్నారు.

16 నుంచి డాక్యుమెంటరీ ఫిల్మ్ మేకింగ్‌పై వర్క్‌షాప్

రాయదుర్గం: మనూలోని బోధన మీడియా సెంటర్(ఐఎంసీ) ఆధ్వర్యంలో ఇండియన్ డాక్యుమెంటరీ ప్రొడ్యూసర్స్ అసోసియేషన్ (ఐడీపీఏ) ముంబాయి సహకారంతో ప్రత్యేక వర్క్‌షాప్ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు ఐఎంసీ డైరెక్టర్ రిజ్వాన్ అహ్మద్ తెలిపారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు, ప్రొఫెషనల్స్, ఇతరులకు డాక్యుమెంటరీ ఫిల్మ్ మేకింగ్‌పై ఈనెల 16 నుంచి 18వ తేదీ వరకు మూడు రోజులపాటు వర్క్‌షాప్‌ను నిర్వహిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొనే వారు పేర్ల రిజిస్ట్రేషన్‌ను మార్చి 12వ తేదీ వరకు చేసుకోవచ్చన్నారు. మరిన్ని వివరాలకు నిర్మాత, వర్క్‌షాప్ కన్వీనర్ మహ్మద్ ముజాహిద్‌ను ఫోన్ నెంబర్ 9885389140లో సంప్రదించాలన్నారు.

ఎస్ఎల్‌జీ ఆస్పత్రిలో వరల్డ్ కిడ్నీ డే

మూత్రపిండాల వ్యాధులపై అవగాహన



ఎస్ఎల్‌జీ ఆస్పత్రిలో జరిగిన కిడ్నీ అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న డయాలసిస్ రోగులు

నిజాంపేట్: జీవనశైలిని అదుపులో ఉంచుకుంటే చాలా వరకు మూత్రపిండాల వ్యాధులను అరికట్టవచ్చని వైద్యనిపుణులు తెలిపారు. బాచుపల్లిలోని ఎస్ఎల్‌జీ ఆస్పత్రి ప్రాంగణంలో గురువారం ఉదయం 11 గంటలకు వరల్డ్ కిడ్నీ డే సందర్భంగా హెల్త్ టాక్ నిర్వహించారు. ఆస్పత్రిలో డయాలసిస్, ఇతర మూత్రపిండాల సమస్యలపై చికిత్సలు పొందుతున్న దాదాపు 30మంది రోగులు, వారి కుటుంబ సభ్యులు హాజరై అవగాహన పెంచుకున్నారు.

◆ ఈ హెల్త్ టాక్‌లో ప్రధానంగా ఆస్పత్రికి చెందిన కన్సల్టెంట్ నెఫ్రాలజిస్టు డాక్టర్ రమేష్, కన్సల్టెంట్ యూరాలజిస్టు డాక్టర్ సంతోష్, డైటీషియన్ సవితా శాస్త్రి, డయాలసిస్ టెక్నీషియన్ శ్రీనివాస్ తదితరులు మాట్లాడుతూ... ×దీర్ఘకాల మూత్రపిండాల వ్యాధులు (క్రానిక్ కిడ్నీ డిసీజ్- సీకేడీ) రావడానికి పలు రకాల కారణాలు ఉంటాయన్నారు. ముఖ్యంగా రక్తపోటు, మధుమేహం ఇందుకు ప్రధాన కారణాలవుతాయని పేర్కొన్నారు.

◆ శారీరక వ్యాయామం, ఆహారపు అలవాట్లు సక్రమంగా ఉండేలా చూసుకోవాలని వైద్యులు సూచించారు. ప్రతి ఒక్కరికి తగినంత నిద్ర అవసరమన్నారు. వీటిలో ఏ ఒక్కటి సరిగా లేకపోయినా మూత్రపిండాల వ్యాధులు వచ్చేందుకు అవకాశం ఉంటుందన్నారు. వాటికి తొలిదశల్లో అయితే డయాలసిస్‌లు చేస్తారు. అందులో రెండు రకాలుంటాయి. అవి హీమోడయాలసిస్, పెరిటోనియల్ డయాలసిస్ ఇవి సరిపోని పక్షంలో ఇక మూత్రపిండాల మార్పిడి శస్త్రచికిత్సలు చేయాల్సి ఉంటుందన్నారు. జన్యుపరమైన సమస్య అయితే చిన్న వయసులోనే అంటే 20లలోనే కిడ్నీ వ్యాధులు వస్తాయని పేర్కొన్నారు. మధ్య వయస్కుల వారికిరు బీపీ నియంత్రణలో లేకపోతే బాధితులవుతున్నారు. మరీ చిన్నపిల్లల్లో అయితే మూత్రనాళాలు సరిగా ఏర్పడకపోవడం లాంటి పుట్టుకతో వచ్చే సమస్యల వల్ల కూడా మూత్రపిండాల వ్యాధులు వస్తాయని అవగాహన కల్పించారు.